నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రంభీం ఆసిఫాబాద్
5 బుధవారం 18 సెప్టెంబర్ 2024
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# గంగమ్మ ఒడికి గణనాథుడు

● పలుచోట్ల వైభవంగా నిమజ్జనం ● కనుల పండువగా శోభాయాత్రలు
● నృత్యాలతో హోరెత్తించిన యువత ● ప్రముఖుల ప్రత్యేక పూజలు



కాగజ్‌నగర్ : పెద్దవాగులో గణనాథులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

మంచిర్యాల అర్బన్/కాగజ్‌నగర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 17: వాడవాడలా కొలువుదీరిన గణనాథుడు మంగళవారం గంగమ్మ ఒడికి చేరాడు. ధూప, దీప నైవేద్యాలతో విశేష పూజలందుకున్న బొజ్జ గణపయ్యకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయాచోట్ల ఉత్సాహంగా సాగిన శోభాయాత్రల్లో డప్పు చప్పుళ్లకను గుణంగా యువతీ యువకులు నృత్యాలు చేశారు. దాండియా, కోలాటాలు ఆడి సందడి చేశారు. 'గణపతి బప్పా మోర్యా' నినాదాలతో ప్రధాన వీధులన్నీ మారుమోగాయి. గోదావరి, వాగులు, చెరువుల్లో నమజ్జనం చేసి వెళ్లిరా.. విఘ్నేశ్వరా అంటూ సాగనంపారు. మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, యువ నాయకుడు విజిత్ రావు పలుచోట్ల వినాయకులను దర్శించుకున్నారు. రామగుండం సీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో డీసీపీ భాస్కర్ బందోబస్తు నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎస్పీ శ్రీనివాసరావు, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రత్యేక పూజలు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తుంపెల్లి వాగు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్వో లోకేశ్వర్‌రావు పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ శ్రీనివాస్ వాసరావు ఆదేశాలతో అడుగడునా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామనుజం ఆధ్వర్యంలో పట్టణ సీఐ శంకరయ్యతో పాటు ఇతర పోలీసు అధికారులు పర్యవేక్షించారు.



కాగజ్‌నగర్ : గణనాథునికి పూజ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస రావు, డీఎస్పీ రామనుజం



మంచిర్యాల అర్బన్ : వినాయకుడి శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



నస్పూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# తెలంగాణ తల్లిని అవమానిస్తారా?

## కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదుల ఫైర్

● కేటీఆర్ పిలుపు మేరకు నిరసనలు ● తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు



చెన్నూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జన్నారం/కోటపల్లి/బెల్లంపల్లి/చెన్నూర్/మందమర్రి/కాగజ్‌నగర్ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 17 : రాష్ట్ర సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించాల్సిన చోట కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేశారు. తెలంగాణ తల్లిని అవమానిస్తారా అంటూ కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతూ ఊరూరా నిరసనలు చేపట్టారు. జన్నారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్‌కుమార్ పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రంలో ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, మాజీ వైస్ చైర్మన్ సుతారి వినయ్, సింగిల్ విండో చైర్మన్ నాసాని రాజన్న, నాయకులు ఫజల్‌ఖాన్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్,బోర్లకుంట ప్రభుదాస్, లెక్కల మల్లయ్య, జంగం రవి, వోలాల నర్సాగౌడ్ పాల్గొన్నారు. కోటపల్లిలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు కొట్టె నారాయణ, రాళ్లబండి శ్యామ్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ కో ఆప్షన్ సభ్యుడు వాజిద్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రెండో వార్డు అధ్యక్షుడు సబ్బని అరుణ్‌కుమార్, నాయకులు సాజిద్, ఖదీర్, శ్రీను, మహేశ్, సురేశ్, చరణ్, మధు పాల్గొన్నారు. చెన్నూర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి నాయకులు రాజా రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జోడు శంకర్, దోమకొండ అనిల్, జగన్నాథుల శ్రీను, కో–ఆప్షన్ సభ్యుడు అయూబ్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, మేడ సురేశ్‌రెడ్డి, అయిత సురేశ్‌రెడ్డి, శ్రీనివాస్, రత్న సమ్మిరెడ్డి, ఆరీఫ్, నాయిని సతీశ్, రాజారాం తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాజారమేశ్, పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సీనియర్ నాయకులు బండారు సూరిబాబు, కొంగల తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేశ్, రాజశేఖర్, ఎండీ అబ్బాస్, భూపెల్లి కనకయ్య, భట్టు రాజ్‌కుమార్, సీపెల్లి సాగర్ పాల్గొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరతరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకుంటూ వచ్చిందని, కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజక వర్గ కన్వీనర్ లెండుగూరే వ్యాంరావు, నాయకులు నక్క మనోహర్, రాజ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : పాలాభిషేకం అనంతరం నినదిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ, నాయకులు



మందమర్రిలో తెలంగాణ తల్లి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ప్రజలను అవమానించినట్లే

-మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 17 : అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమని, ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమేనని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. నస్పూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. దివాకర్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మొండిగా వ్యవహరిస్తూ పాలన సాగిస్తున్నారని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని కుట్ర పన్నుతున్నాడని మండిపడ్డారు. ప్రజా సమస్యలు పక్కనబెట్టి పంతాలకు పోతున్నారని, అధికారంలో ఉన్నామని కక్ష రాజకీయాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ తల్లికి జరిగిన అవమానాన్ని మేధావులు, తెలంగాణవాదులు, ఉద్యమకారులు ఖండించాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు కుర్మిళ్ల అన్నపూర్ణ, జబీన్‌హైమద్, నాయకులు పానుగంటి సత్తయ్య, దగ్గుల మధు, కాటం రాజు, జాడి భానుచందర్, జక్కుల కుమార్, రఫీక్‌ఖాన్, తోట దుర్గాప్రసాద్, ఆకునూరి సంపత్‌కుమార్, అమృత రాజ్‌కుమార్, గర్సె భీమయ్య, మాడుగుల స్వామిదాస్, ముక్కెర వెంకటేశ్, బానోత్ రాజునాయక్, బండారి తిరుపతి, అడ్లకొండ రవిగౌడ్ పాల్గొన్నారు.



బెల్లంపల్లి : పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్



కోటపల్లి : తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



జన్నారంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

# విశ్వకర్మ ఆదర్శప్రాయుడు

### ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 17 : వాస్తు శిల్పులకు విశ్వకర్మ ఆదర్శప్రాయుడని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతిలో ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్‌తో కలిసి హాజరయ్యారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఘనంగా విశ్వకర్మ జయంతి

నస్పూర్, సెప్టెంబర్ 17 : నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో వాస్తు శిల్పి, ప్రతిమ శాస్త్ర పితామహుడు విరాట్ విశ్వకర్మ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవల ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్సీ విఠల్

# మహనీయుల త్యాగాలు మరువలేనివి

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు ● కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం



గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు

నస్పూర్, సెప్టెంబర్ 17 : దేశం కోసం మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్పూర్‌లోని కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలకు కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశీష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్‌తో కలిసి హాజరయ్యారు. గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అమరవీరులు చేసిన పోరాటాల ఫలితంగా నేడు మనం స్వేచ్ఛను అనుభవిస్తున్నామన్నారు. అంతకుముందు జడ్పీ కార్యాలయ భవన సముదాయంలో కలెక్టర్ కుమార్ దీపక్, జడ్పీసీఈవో గణపతితో కలిసి ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

# యోధుల త్యాగాలతోనే ప్రజలకు స్వేచ్ఛ

### శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

ఆసిఫాబాద్ టౌన్, ఆసిఫాబాద్ అంబేద్కర్ క్, సెప్టెంబర్17 : పోరాటయోధుల త్యాగాలతోనే నేడు తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎస్పీ శ్రీనివాస్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఆర్డీవో లోకేశ్వరరావు, డీఎస్పీ కరుణాకర్ పాల్గొన్నారు. జడ్పీ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఏఆర్‌హెడ్ క్వార్టర్‌లో ఎస్పీ శ్రీనివాస రావు, జిల్లా గ్రంథాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. రిటైర్డు సంఘం భవనంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు కర్ణాగౌడ్ పాల్గొన్నారు.



జాతీయ జెండా ఆవిష్కరణ చేస్తున్న శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

# పాతబస్టాండ్ స్థలం కబ్జా

● దుకాణాల ముందు అక్రమంగా రేకుల షెడ్లు ● పార్కింగ్ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్న వ్యాపారులు
● వాహనాలు నిలిపేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు ● జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
● చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 17 : పట్టణంలోని పాత బస్టాండ్ స్థలం కబ్జాకు గురవుతున్నది. కొందరు తమ దుకాణాల ముందు అక్రమంగా రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. పదిహేను రోజుల క్రితం తన దుకాణం ముందు మీటర్ ఎత్తులో గోడ నిర్మించిన ఓ వ్యక్తి.. తాజాగా (సోమవారం) రేకుల షెడ్డును సైతం నిర్మించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో పాతబస్టాండ్ వద్ద దుకాణాల ముందు సామగ్రి ఉంచి వ్యాపారాలు చేయడం వల్ల వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తాయి. ఈ విషయాన్ని గ్రహించిన అప్పటి కలెక్టర్.. అప్పటి కమిషనర్‌పై సీరియస్ అయ్యారు. ఆయన వెంటనే సదరు యజమానులకు గట్టి వార్నింగ్ కూడా ఇచ్చారు. అయినా వ్యాపారుల్లో ఎలాంటి మార్పు రాకపోగా, ప్రస్తుతం దుకాణాల ముందు అక్రమ నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతున్నది. ఇప్పటికే పాతబస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు హాల్టింగ్ చేయడానికే డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు వచ్చే సమయానికి అక్కడే ఆటోలు, ద్విచక్రవాహనాలు నిలిపి ఉంచడం వల్ల ఆర్టీసీ డ్రైవర్లు అవస్థలు పడాల్సి వస్తున్నది. బజార్ ఏరియాలోనూ దుకాణాల ముందు ఉన్న పార్కింగ్ స్థలాలను కూడా ఆక్రమించుకొని వ్యాపారాలు చేయడం వల్ల.. కొనుగోలు దారులు తమ వాహనాలను మెయిన్‌రోడ్డుపై నిలిపి వేయాల్సి వస్తున్నది. దీంతో పోలీసులు సదరు వాహన యజమానులకు జరిమానా విధించి చలాన్లు కూడా వేస్తున్నారు. ఇలాగైతే త మ వాహనాలను ఎక్కడ నిలపాలో అధికారులే చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.



పాతబస్టాండ్ స్థలంలో అక్రమంగా నిర్మించిన శాశ్వత రేకుల షెడ్డు

### పోలీసుల సాయంతో అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం

మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను పోలీసుల సాయంతో కూల్చివేస్తాం. ఇప్పటికే ఏసీపీ రవికుమార్‌తో మాట్లాడాను. కార్యాచరణ రూపొందిస్తున్నాం. త్వరలో అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తాం. పాతబస్టాండ్ స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డును తొలగిస్తాం. మురుగుకాలువలు, దుకాణాల ముందు అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కూల్చివేయకముందే దుకాణాదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి. -శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

### కబ్జాలకు చెక్ పెట్టేనా..!

బెల్లంపల్లి పాత బస్టాండ్‌కు ఘనమైన చరిత్ర ఉంది. కొత్తబస్టాండ్ నిర్మాణం కాకముందు ఇక్కడి నుంచే ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేవి. ఆర్టీసీ బస్సులు తిప్పుకొని.. వెళ్లేంత స్థలం ఉండేది. కొత్త బస్టాండ్ ప్రారంభమైనప్పటి నుంచి పాతబస్టాండ్‌ను కేవలం ప్రయాణికులను ఎక్కించుకోవడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. ఇప్పటికే పాతబస్టాండ్ వద్ద పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుండగా, దుకాణాదారులు ఓ అడుగు ముందుకేసి పార్కింగ్‌కు వినియోగించే స్థలాలను సైతం కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో మున్ముందు ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమయ్యే ప్రమాదమున్నది. ఇకనైనా అధికారులు కబ్జాలకు చెక్‌పెట్టి.. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారో.. లేదో వేచి చూడాలి మరి.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679